# నగరాన్ని డ్రైనేజీ సమస్యలు లేని సర్వాంగ సుందర తీర్చిదిద్దడమే లక్ష్యం

## కమిషనర్ కె.మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, జూన్ 7 ప్రభాతవార్త : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, నగరాన్ని డ్రైనేజీ సమస్యలు లేని సర్వాంగ సుందర నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమంలో భాగంగా రెండో వారం డ్రైన్ల శుభ్రం విజయవంతంగా జరిగిందని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గత వారం రోజుల్లో నగరంలోని అన్ని డివిజన్లలో ఉన్న చిన్న, మీడియం డ్రైన్లను పూర్తిగా గుర్తించి, వాటిలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, పూడికను తొలగించి శుభ్రం చేయడం జరిగిందని తెలిపారు. పారిశుధ్య పనుల్లో ఎక్కడా అలసత్వం వహించకుండా పనుల వేగాన్ని పెంచేందుకు వీలుగా ప్రతి రోజు ప్రతి డివిజన్‌కు 100 మంది చొప్పున అదనపు పారిశుధ్య కార్మికులను తీసుకొని, వీరందరితో నగరంలోని అంతర్గత రహదారులు, కాలువలను సమగ్రంగా



శుభ్రం చేయించడం జరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా వర్షాకాలంలో నగరంలో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా, వరద ముప్పును నివారించేందుకు ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో మేజర్ కాలువల ప్రక్షాళన చేపట్టామని, ఇందులో భాగంగా నగరవ్యాప్తంగా షుమారు 45 కిలోమీటర్ల పొడవునా ఉన్న ప్రధాన మేజర్ డ్రైన్లు, 80 కిలోమీటర్ల మీడియం డ్రైన్లలో అత్యాధునిక యంత్రాలు, సిబ్బంది సహాయంతో పూడికతీత పనులను పూర్తి చేశామన్నారు. రానున్న వర్షాలను తట్టుకునేలా నగర డ్రైనేజీ వ్యవస్థను సిద్ధం చేయడమే మొదటి ప్రాధాన్యత తో ఇందుకోసం ఇంజినీరింగ్ పారిశుధ్య విభాగాలు సమన్వయంతో శనివారం చేపట్టామన్నారు. ఈ వారంలో మరింత పక్కా ప్రణాళికతో ప్రతిరోజూ ఉదయం పూట డ్రైన్ డీసిల్టింగ్, బ్యాక్ లేన్ శానిటేషన్, నాలాల పిచ్చిమొక్కల తొలగింపు, తుఫాను నీటి కాలువల క్లియరెన్స్, నిల్వ నీటి తొలగింపు యాంటీలార్వా వంటి దోమల నివారణ చర్యలు ముమ్మరంగా చేపట్టినట్లు వివరించారు.

## ఘనవ్యర్థాల నిర్వహణ పై నూతన మార్గదర్శకాలపై అవగాహన కార్యక్రమాలు

గుంటూరు కార్పొరేషన్, జూన్ 6 (ప్రభాత వార్త) : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఘనవ్యర్థాల నిర్వహణ పై నూతనంగా జారీ చేయబడిన మార్గదర్శకాల మేరకు అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామని నగర కమిషనర్ కే.మయూర్ అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 5వ తారీఖు నుండి 12వ తారీఖు వరకు "ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు – 2026 పై అవగాహన" అనే ప్రధాన అంశంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనికి




సంబంధించి 2026 ఘన వ్యర్థాల నిర్వహణకు నూతన మార్గదర్శకాలు జారీ చేయబడ్డాయని, ఈ మార్గదర్శకాల పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలియచేశారు. ఇప్పటికే ఘన వ్యర్థాల నిర్వహణ పై ప్రజారోగ్యాధికాలకు, ప్రజారోగ్య కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించామని తెలియచేశారు. అదేవిధంగా శనివారం ఏటుకూరు రోడ్డులోని కంపోస్టింగ్ యూనిట్, మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (యం.ఆర్.యఫ్) లకు ఎక్స్‌పోజర్ విజిట్ చేయుట జరిగిందని, దీనికి తోడు వర్క్‌షాప్ నిర్వహించబడిందన్నారు. ఈ నెల 7 నుండి 12వ తారీఖు వరకు నగరంలో డివిజన్ల వారీగా విస్తృత స్థాయిలో మొక్కల నాటడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియచేశారు. ఈ కార్యక్రమాలు నిర్వహించుట ద్వారా, పర్యావరణ పరిరక్షణ, తడి పొడి చెత్తలను వేరు వేరుగా సేకరించి, సదరు వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ మరియు గ్రీనరి అభివృద్ధి పై పట్ల ప్రజల్లో అవగాహన పెరిగి గుంటూరు నగరం క్లీన్ అండ్ గ్రీన్ నగరంగా తీర్చిదిద్దుట జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సిహెచ్ శ్రీనివాస్, సియంఓహెచ్ డాక్టర్ శాంతి కళ, వియయస్ డాక్టర్ నాగేశ్వర రావు, ఏడిహెచ్ శాంతి, యస్.యస్ లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## డాక్టర్ దాసరి సాయి తేజస్వినిని అభినందించిన మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్రా అప్పారావు

గుంటూరు విద్య జూన్ 7 ప్రభాతవార్త : ఆసియాలోకల్లా పెద్దదైనటువంటి గుంటూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్రాఅప్పారావు తన మిత్రులు,రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, శ్రీ వికాస్ విద్యాసంస్థల అధినేత దాసరి రాజా మాష్టారు కుమార్తె డాక్టర్ .దాసరి సాయి తేజస్విని ఎండి (రేడియాలజి)మంచి ర్యాంక్తో ఉత్తీర్ణత సాధించడమే కాకుండా, ప్రతిష్టాత్మకమైన పీటల్ ఇంటర్వెన్షన్ కోర్సులో సీటు సాధించిన సందర్భముగా డాక్టర్ .సాయి తేజస్విని నీ అభినందించారు. ఆమెను అభినందించేందుకు, ప్రోత్సహించేందుకుగాను, గుంటూరు నెహ్రూనగర్ నందలి శ్రీవికాస్ విద్యా సంస్థల ఆవరణలోని దాసరి రాజా మాష్టారు నివాసానికి వచ్చారు. ఈ సందర్భముగా ఒకవైపు డాక్టర్.సాయితేజస్విని ని అభినందించి, దాసరి రాజా మాష్టారు నాకు 30 ఏండ్లుగా




మంచి స్నేహితుడని, నారాలోకేష్,చంద్రబాబు నాయుడు లకు ,టిడిపి కి నమ్మకమైన నాయకుడు అని,త్వరలో నారా లోకేష్ ఆశీస్సులతో ఉన్నత స్థాయి అవకాశం పొందనున్నారని, పార్టీ కోసం కష్టపడిన రాజా మాష్టారు కష్టాన్ని పార్టీ మర్చిపోదని అన్నారు. ఈ సందర్భంగా తమ నివాసానికి వచ్చిన ఏ ఎం సి చైర్మన్ అప్పారావు ని దాసరి రాజా మాష్టారు కుటుంబ సభ్యులు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.,ఈ కార్యక్రమంలో రాజా మాష్టారు తోపాటూ,శ్రీవికాస్ స్కూల్ ఏజీఎం శ్రీదేవి రాజా మాష్టారు, డాక్టర్.సాయి తేజస్విని, ఏ ఎం సి వైస్ చైర్మన్: బిట్రగుంట మల్లికా పాల్గొన్నారు..

## ప్రజాసేవకే వన్నెతెచ్చిన మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు

### మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్

గుంటూరు విద్య, జూన్ 7 ప్రభాతవార్త : నాలుగు దశాబ్దాల పాటు ప్రజా సేవలో నిరంతరం కృషి చేస్తూ అభివృద్ధికి ప్రత్యేక బాటలు వేసిన మహోన్నత వ్యక్తి ప్రజా సేవకే వన్నెతెచ్చిన మాజీ పార్లమెంట్ సభ్యులు రాయపాటి సాంబశివరావు అభినందనీయులని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితర రాజకీయ ప్రముఖులు రాయపాటి సాంబశివరావు ను కొనియాడారు. ఆదివారం ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని గుంటూరులోని ఆయన నివాసంలో అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్, రాయపాటి యువసేన నాయకులు రాజపుత్ర సత్యం సింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారీ కేకులు స్వయంగా రాయపాటి సాంబశివరావు కేక్ కట్ చేసి అభిమానులకు తినిపించి ఆనందం పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి గుంటూరు



ప్రాంతానికి చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై రాయపాటి సాంబశివరావు కి పుష్పగుచ్ఛాలు అందజేసి , పూలమాలలు వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రివర్యులు, శాసనమండలి సభ్యులు డొక్కా మాణిక్య వర ప్రసాద్ మాట్లాడుతూ, ఎందరో కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దిన మహానేత రాయపాటి సాంబశివరావు అని, ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఆయన రాజకీయ ప్రస్థానం కొనసాగిందని కొనియాడారు. మాజీ శాసనమండలి సభ్యులు రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని నిరంతరం ప్రజాసేవలో కొనసాగుతున్న సోదరులు రాయపాటి సాంబశివరావు గారికి చేదోడు వాదోడుగా నిలవడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. జన్మదిన వేడుకల సందర్భంగా రాయపాటి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేట లోని షిరిడి సాయి దీన జన సేవా సమితిలో విద్యార్థులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాయపాటి మమత , నగర సిటీ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు మాధారాధా, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ దాసరి జాన్ బాబు, మాజీ కార్పొరేటర్లు మద్దిరాల మ్యాని, అడపా బాబు, గాంధీ చౌదరి, ఓ బి సి రాష్ట్ర అధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద్, వెన్న సాంబశివారెడ్డి, పెదకూరపాడు బుజ్జి, బొల్లేపల్లి సత్యనారాయణ, షేక్ జిలాని , షేక్ సుభాని, కొనిదే మోహన్ గోపికృష్ణ, షేక్ మీరావలి, జి జి హెచ్ నరసింహారావు, ఆలూరి చంద్రశేఖర రావు, కట్ట రాజేంద్ర, బండి శ్రీనివాసరావు తదితరులు కలరు.

గుంటూరు వార్త



# కార్పొరేషన్ పరిధిలో బిల్డర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

## నగర కమిషనర్ కే.మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, జూన్ 6 (ప్రభాతవార్త) : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో బిల్డర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కే.మయూర్ అశోక్ వెల్లడించారు. ప్రతి 3 నెలలకు ఒకసారి బిల్డర్లు, అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నరేడ్కో ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. తొలుత బిల్డర్లు సర్వే దరఖాస్తులు ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ విధానంలో ఇవ్వాలని, రెవెన్యూ సిబ్బంది ఫైల్స్ పరిష్కారం వేగంగా చేయాలని, భవన నిర్మాణ అనుమతుల్లో జాప్యాన్ని నివారించాలని, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు విఎల్టీ తగ్గింపు అమలు చేయాలని వారు కమిషనర్ ని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ, అత్యవసర సమస్యలు ఉంటే



వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి 3 నెలలకు ఒక్కసారి బిల్డర్ల ప్రతినిధులు, అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. విఎల్టీ తగ్గింపుపై ప్రభుత్వ ఆదేశాలు అందిన వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. నిర్మాణ పనులకు నీటిని నగరంలోని రిజర్వాయర్ల నుండి ఇవ్వలేమని, తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్ లో ట్రీట్మెంట్ అనంతరం వచ్చే నీటిని కావాలంటే తీసుకోవచ్చని తెలిపారు. ఎల్ఆర్ఎస్ ఫైల్స్ ని ఈ నెలాఖరులోపు పరిష్కారం చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ మంజూరు, మార్ట్ గేజ్ విడుదల వేగంగా జరిగేలా, క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారం కోసం ప్రణాళిక కార్యదర్శులకు శిక్షణ అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సిటి ప్లానర్ రాంబాబు, డిప్యూటీ సిటి ప్లానర్ సూరజ్ కుమార్, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, నరేడ్కో క్యాపిటల్ జోన్ ప్రెసిడెంట్ కెసిహెచ్.అంకారావు, సెక్రెటరీ ఎం.శ్రీనివాస్, గద్దె తిరుపతిరావు, చుక్కపల్లి రమేష్, శ్రీనివాస్ కుమార్, హరి శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకనం ఓరియంటేషన్ కార్యక్రమం

గుంటూరు విద్య జూన్ 7 ప్రభాతవార్త: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం కోసం చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లకు ఓరియంటేషన్ కార్యక్రమం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, గుంటూరు నందు నిర్వహించబడింది. సైమన్ విక్టర్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, రమేష్ ఓ ఎస్ డి ఈ కార్యక్రమానికి హాజరై పరీక్షకులను ఉద్దేశించి ప్రసంగించారు.

**సమావేశంలోని ముఖ్యాంశాలు:..**

సైమన్ విక్టర్ మాట్లాడుతూ మూల్యాంకనాన్ని స్కీమ్ ఆఫ్ వాల్యుయేషన్ ప్రకారం కచ్చితంగా చేయాలని సూచించారు. ఏ జవాబునూ వదిలిపెట్టకుండా ప్రతి జవాబును మూల్యాంకనం చేయాలని




తెలిపారు. అండర్ వాల్యుయేషన్, ఓవర్ వాల్యుయేషన్ చేయవద్దని కోరారు. రమేష్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రాసెసింగ్, పాఠ్యప్రణాళిక రూపకల్పనలో బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ భారతదేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన బోర్డులలో ఒకటని పేర్కొన్నారు. సునీత ఆర్ ఐ ఓ మాట్లాడుతూ మూల్యాంకన క్యాంపు సమయం ఉదయం 10:00 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు అని, మధ్యలో ఒక గంట లంచ్ బ్రేక్ ఉంటుందని తెలిపారు. క్యాంపుకు ఆలస్యంగా రావడం, ముందుగా వెళ్లిపోవడం అనుమతించబడదని స్పష్టం చేశారు. క్యాంపు లోపల మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాల వాడకం నిషేధం అని అన్నారు. ఉమ ఏ సి ఓ జనరల్1 మాట్లాడుతూ పరీక్షకులందరూ తప్పనిసరిగా ఐడి కార్డు ధరించాలని తెలిపారు. మూల్యాంకన హాలులో కఠిన క్రమశిక్షణ పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జయశీల, ఏ సి ఓ జనరల్2, ఏ సి ఓ వాల్యుయేషన్, చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య సేవలు అనిర్వచనీయం

## ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ రవికుమార్

గుంటూరు విద్య జూన్ 7 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య 42 ఏళ్లుగా నిర్వహిస్తున్న సేవలు అనిర్వచనీయం అని,ఇతర సంస్థలు ఏవి కూడా దీనికి సరిపాటి కాదని అన్నారు ఆల్ ఇండియా బ్రాహ్మిణ్ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ ద్రోణంరాజు రవి కుమార్ కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య 43 వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు న్యూ ఇన్నర్ రింగ్ రోడ్డు లోని సెంట్రల్ కార్యాలయంలో సమాఖ్య పతాకాన్ని రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్




శర్మ తో కలిసి ఎగురవేశారు. 202627 ఏడాది కార్యక్రమాల క్యాలెండర్ ను విడుదల చేశారు, ఆగస్టు 8 న కనకదుర్గమ్మకు ఆషాఢ పట్టి, ఆగస్ట్ నెల 22 న ఉత్తరాంధ్ర మెగా జాబ్ మేళాను, కార్తీక మాసం లో వన సమారాధన, మెడికల్ సదుపాయం, వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా ద్రోణంరాజు రవి కుమార్, సమాఖ్య అడ్వైజరీ కమిటీ చైర్మన్ సత్యవాడ దుర్గా ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్ కె మనోహర రావు, కోశాధికారి పులిపాక ప్రసాద్ , రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి వి ఎస్ శర్మ ప్రసంగిస్తూ సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు., బ్రాహ్మణ సామాజిక వర్గం రాజకీయంగా బలోపేతం కావాలని కోరారు. చట్టసభల్లో బ్రాహ్మణులు లేకపోవడం వల్లే బ్రాహ్మణుల సంక్షేమం గురించి మాట్లాడే నాథుడే లేక పోవడం బాధాకరమని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు బ్రాహ్మణుల సత్తా ఏమిటో అర్థం అయ్యేలాగా సభలను నిర్వహించాలని తెలిపారు. రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలుగా పోలూరు అర్చన, రాష్ట్ర మహిళా విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి గా యడవల్లి శ్రీవల్లి ని నియమించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన ద్రోణంరాజు రవి కుమార్, సత్యవాడ దుర్గా ప్రసాద్, ఆడిటర్ బొమ్మరాజు పాండురంగారావు లను ను దుశ్శాలువ మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ సలహాదారులు వి ఎస్ మధుబాబు, జిల్లా అధ్యక్షుడు లలిత శాస్త్రి, హెచ్ కె రాజశేఖర్, మారేపల్లి మూర్తి, యడవల్లి శ్రీనివాస శర్మ, మాచిరాజు మురళి కృష్ణ, మాటేటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సామాన్య కుటుంబం నుంచి ఉన్నత శిఖరాలకు..

## రాజ్యసభ సభ్యునిగా ఎంపికైన భాష్యం రామకృష్ణ

గుంటూరు విద్య, జూన్ 7, ప్రభాతవార్త: రాజ్యసభ సభ్యునిగా టిడిపి తరపున ప్రముఖ విద్యా సంస్థ భాష్యం రామకృష్ణ ఎంపికైన సంగతి విదితమే. ఈ సందర్భంగా ప్రభాతవార్తతో ఆయన మాట్లాడారు. ఆయన మాటల్లోనే... నేను ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించాను. మా అమ్మగారి అపారమైన ప్రేమ,త్యాగం,ప్రోత్సాహం మరియు ఆశీస్సులతోనే నేను ఉన్నత విద్యను అభ్యసించే భాగ్యం పొందాను. జీవితంలో ఒక్క క్షణం కూడా వృథా చేయకుండా కష్టపడి పనిచేయాలనే తపన నాలో చిన్ననాటి నుంచే ఉండేది. ఒక ప్రైవేట్ పాఠశాలలో గణితశాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తూనే, ట్యూషన్ సెంటర్ నిర్వహించి వేలాది మంది విద్యార్థులకు విద్యాబోధన చేయడం, వారిలో ఆత్మవిశ్వాసం నింపడం, వారిని ఉన్నత స్థాయికి తీర్చిదిద్దడం ద్వారా సమాజం నుండి అపారమైన ఆదరణ,ప్రశంసలు పొందాను. ఆ ప్రోత్సాహమే "నేను ఎందుకు ఒక మంచి విద్యాసంస్థను స్థాపించకూడదు?" అనే సంకల్పానికి నాంది పలికింది. ఆ సంకల్ప ఫలితంగానే 1993లో మా ఇంటి పేరుతో "భాష్యం" విద్యాసంస్థను ప్రారంభించాను. నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, విలువలతో కూడిన బోధనను లక్ష్యంగా చేసుకొని ప్రారంభమైన ఆ చిన్న ప్రయత్నం, ప్రజల ఆదరణతో నేడు మూడు రాష్ట్రాలలో విస్తరించి లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే మహా విద్యా ఉద్యమంగా రూపాంతరం చెందడం నాకు ఎంతో ఆనందాన్ని, గర్వాన్ని కలిగిస్తోంది. నాకు చిన్ననాటి నుంచే మహానేత, తెలుగు



ప్రజల ఆత్మగౌరవ ప్రతీక, అన్నగారైన శ్రీ నందమూరి తారక రామారావు గారంటే అపారమైన అభిమానం. అనంతరం గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు మా విద్యాసేవలను గుర్తించి, 2014, 2019 మరియు 2024 సంవత్సరాలలో ప్రత్యక్ష రాజకీయాలలోకి రావాలని, ప్రజాసేవలో మరింత విస్తృత పాత్ర పోషించాలని ఎంతో ఆప్యాయతతో, అభిమానంతో ప్రోత్సహించడం జరిగింది. ఆ మహోన్నత నాయకత్వం పట్ల గౌరవంతో, వారి ఆదేశాలకు అనుగుణంగా నేను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటూ వచ్చాను. అటువంటి నాపై విశ్వాసం ఉంచి, ఈ రోజు రాజ్యసభ సభ్యత్వానికి పోటీ చేసే అరుదైన అవకాశాన్ని కల్పించిన పూజ్యులు, దూరదృష్టి గల నాయకులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి, శ్రీ నారా లోకేష్ గారికి, అలాగే తెలుగు దేశం పార్టీ పెద్దలందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు మరియు వినయపూర్వక నమస్సులు తెలియజేస్తున్నాను. ఒక సాధారణ రైతు కుటుంబం నుండి వచ్చిన నాపై వారు ఉంచిన నమ్మకం నాకు గౌరవంతో పాటు మరింత బాధ్యతను కూడా పెంచింది. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, రాజ్యసభ వేదికగా రాష్ట్ర అభివృద్ధికి, విద్యారంగ పురోగతికి, యువత భవిష్యత్తు నిర్మాణానికి మరియు సమాజ సంక్షేమానికి అంకితభావంతో సేవ చేస్తానని హామీ ఇస్తున్నాను. నన్ను ఈ స్థాయికి తీసుకువచ్చిన ప్రజలకు, నా కుటుంబ సభ్యులకు, నా సహచరులకు మరియు నేను హృదయపూర్వకంగా విశ్వసించే తెలుగు దేశం పార్టీకి జీవితాంతం కృతజ్ఞుడిగా ఉంటాను. వారి ఆశయాలకు అనుగుణంగా నిబద్ధతతో, నిజాయితీతో, అంకితభావంతో సేవ చేయడం నా ధర్మంగా భావిస్తున్నాను. మరొక్కసారి నాపై విశ్వాసం ఉంచిన పార్టీ నాయకత్వానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ, ఆ విశ్వాసాన్ని కార్యరూపంలో నిలబెట్టేందుకు నా శక్తి సామర్థ్యాలన్నింటినీ వినియోగిస్తానని వినమ్రంగా తెలియజేస్తున్నాను.

# పర్యావరణ పరిరక్షణ,కాలుష్య నియంత్రణపై సైకిల్ ర్యాలీ

గుంటూరు క్రైమ్, జూన్7, ప్రభాతవార్త: గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ఆరోగ్యకర జీవనశైలిపై ప్రజల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో గుంటూరు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎస్బీ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, ఏఆర్ డీఎస్పీ సంకురయ్య నేతృత్వంలో ఉదయం 6:30 గంటల నుంచి 7:00 గంటల వరకు జరిగిన ఈ ర్యాలీ జిల్లా పోలీసు కార్యాలయం నుండి ప్రారంభమై నగరంపాలెం మూడు బొమ్మల సెంటర్ మీదుగా ఎంటీబీ సెంటర్ వరకు వెళ్లి తిరిగి జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వాహనాల వినియోగాన్ని సాధ్యమైనంత మేర తగ్గించడం ద్వారా గాలి కాలుష్యాన్ని నియంత్రించవచ్చని, సైక్లింగ్‌ను ప్రోత్సహించడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యక్తిగత ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడంతో పాటు పర్యావరణహిత జీవన విధానాలను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ 5251 బి.వి. నారాయణ ప్రారంభించారు. ర్యాలీలో ఎస్బీ డీఎస్పీ, ఏఆర్ డీఎస్పీ, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, సురేష్, రామకృష్ణ రెడ్డి, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించేందుకు అందరూ భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు.

# ఘనంగా వివిఐటియు సైకిల్స్ ఆన్ సండే ర్యాలీ

గుంటూరు విద్య, జూన్ 7, ప్రభాతవార్త: ప్రజలలో శారీరక శ్రమ, ఆరోగ్యంపై అవగాహన పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే లక్ష్యంతో, "ఫిట్ ఇండియా" పిలుపు మేరకు వివిఐటి విశ్వవిద్యాలయం నిర్వహించిన "సైకిల్స్ ఆన్ సండే" ర్యాలీ ఘనంగా జరిగింది. ఈ ర్యాలీని వివిఐటి విశ్వవిద్యాలయం ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ ప్రారంభించారు. గుంటూరు నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం నుండి గుజ్జనగుండ్ల వద్ద గల వివిఐటి కార్యాలయం వరకు సుమారు




పది కిలోమీటర్ల మేర సాగిన ఈ ర్యాలీలో విద్యార్థులు, గుంటూరు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిఐటి ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ... ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిఐటి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. విద్యార్థులు, యువత ఆదివారాల్లో సాధ్యమైనంత వరకు సైకిళ్లను వినియోగించేలా అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) అధికారి అఫ్రోజ్ ఖాన్, వివిఐటియు ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. అరుణ్ కుమార్, ఎన్‌సీసీ సంధానకర్త కెప్టెన్ సయ్యద్ బిబన్ బాషా, ఎన్ఎస్ఎస్ సంధానకర్త డాక్టర్ భక్త సింగ్ మరియు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయుడు షేక్ దరియావలికి జాతీయస్థాయి జీవిత సాఫల్య అవార్డు

గుంటూరు విద్య జూన్ 7 ప్రభాతవార్త: భాషాభివృద్ధికి, విద్యారంగ సేవలకు అంకితభావంతో కృషి చేసిన గుంటూరు నగరపాలక సంస్థ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ దరియావలి




జాతీయస్థాయి జీవిత సాఫల్య అవార్డుతో అలహాబాద్ యూనివర్సిటీ హెచ్ ఓ డి మరియు అలీగడ్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ న్యూఢిల్లీ వారి చే ఘనంగా సత్కరించబడ్డారు. న్యూఢిల్లీ లోని గాలిబ్ అకాడమీలో జరిగిన ఘనమైన కార్యక్రమంలో ఆయన సేవలను గుర్తించి ఈ ప్రతిష్టాత్మక అవార్డుతో పాటు గోల్డ్ మెడల్ కూడా అందజేశారు. గత 25 సంవత్సరాలుగా విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తూ, దేశవ్యాప్తంగా భాషా పరిరక్షణకు కృషి చేసిన ఆయన, ముఖ్యంగా పేద మరియు వెనుకబడిన విద్యార్థుల విద్యా ప్రగతికి అంకితభావంతో పనిచేస్తూ ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఈ అవార్డు నాకు గౌరవమే కాదు, మరింత బాధ్యతను కూడా పెంచిందన్నారు. విద్యార్థుల్లో భాషా ప్రేమను పెంపొందిస్తూ, వైభవాన్ని మరింత విస్తరించేందుకు కృషి చేస్తాననీ" తెలిపారు.



